WWW.TELUGUJYOTHIDAILY.IN
www.epapertelugujyothidaily.in
PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న తెలుగు జ్యోతి న్యూస్ తెలుగు నపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. కలిగినవారు సంప్రంచగలరు

సెల్ : 97009 59506

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 02 | సంచిక: 72 | ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ | మంగళవారం 21 జులై 2026 | పేజీలు : 6 | వెల : 4-00

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA,SRIKAKULAM



## తొలి రోజే దుమారం

- నీట్, అయోధ్యలో విరాళాల చోరీ, విద్యార్థుల నిరసనలపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలు
- పలుమార్లు వాయిదాపడిన ఉభయ సభలు
- 'ఇండియా'కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి
- తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి

# క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ట భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి




హైదరాబాద్

తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం - మిగతా3లో



## ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం!

- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం అందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారు

హైదరాబాద్

టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా - మిగతా3లో




## కోరలు చాస్తున్న పేదరికం

- పాకిస్తాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం..
- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం

## 'అపార్' తల్లిదండ్రుల ఇష్టం

- సమ్మతి పత్రంలో ఆప్ట్-అవుట్ ఆప్షన్ ఉండాల్సిందే
- ఆ మేరకు సవరణలు చేపట్టాలి
- సీబీఎస్ఈకి ఆదేశాలు జారీ చేస్తామన్న సుప్రీంకోర్టు
- దేశవ్యాప్తంగా ఒడిశా హైకోర్టు తీర్పు అమలుకు నిర్ణయం





## డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయి

- కేంద్రమంత్రి జేపీ నడ్డాతో క్రాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

# తెలంగాణలో భూసేకరణకు ప్రత్యేక చట్టం

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు!
- రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ పూలింగ్ చట్టానికి ప్రభుత్వం కసరత్తు
- భూమి కోల్పోయే రైతులకు అభివృద్ధి చేసిన స్థలాలు
- ముసాయిదా బిల్లుకు తుది రూపు



హైదరాబాద్

తెలంగాణలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం వేగంగా కసరత్తు ప్రారంభించింది. తెలంగాణ కాంప్రహెన్సివ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లానింగ్ బిల్లు-2026 ప్రాథమిక ముసాయిదా సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ బిల్లులో ఏమేం అంశాలు ఉండాలో సీఎస్ సంజయ్‌జాజు పురపాలక, రోడ్లు-భవనాలు, ఇరిగేషన్, రవాణా తదితర శాఖలు, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో గురు, శుక్రవారాల్లో సెక్రేటరియట్‌లో చర్చలు చేశారు. ఈ ముసాయిదా బిల్లుకు తుది రూపు ఇచ్చేందుకు అధికారుల కసరత్తు - మిగతా3లో



## అంతరిక్ష రంగంలో యువత అద్భుతాలు

- వర్షాలు బాగుండాలి
- వర్షాకాల సమావేశాలూ బాగుండాలి
- రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో మోదీ పిలుపు
- "దేశ పురోగతిలో యువత పాత్ర అత్యంత కీలకం
- వారి సామర్థ్యాలు, ఆకాంక్షలు అంతరిక్షమంత విశాలమైనవి.
- 56 ఏళ్ల యువకుని గురించి మాట్లాడట్లేదు
- రాహుల్‌కు మోదీ చురక

# ఎల్ నినోను ఎదుర్కొంటాం




- రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం
- ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటాం
- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

# డయల్-112 అత్యవసర సేవల తక్షణ స్పందనతో యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు...






యువకుడు ప్రాణాలు కాపాడిన ఆమదాలవలస కానిస్టేబుల్ "సూర్యరావు"
కానిస్టేబుల్ సూర్యారావును అభినందించిన "జిల్లా ఎస్పీ"

తెలుగు జ్యోతి న్యూస్ ఆమదాలవలస నియోజకవర్గం

పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గలవిల్లి గ్రామానికి చెందిన కర్రీ రమణ డయల్-112 అత్యవసర సేవలకు ఫోన్ చేసి, తన స్నేహితుడు విజయనగరం జిల్లా రేగిడి ఆముదాలవలస మండలం ఒనుకూరు గ్రామానికి చెందిన తామాడ శంకర్రావు కుటుంబ సమస్యల కారణంగా ఆమదాలవలస రైల్వే స్టేషన్లో ఆత్మహత్యకు యత్నించే అవకాశముందని సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే డయల్-112 పోలీసు కంట్రోల్ రూమ్ అత్యవసరంగా స్పందించి సంబంధిత పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసింది. ఈ మేరకు సమాచారం అందుకున్న ఆమదాలవలస పోలీసు స్టేషన్ పోలీసు కానిస్టేబుల్ (పీసీ-1847) సూర్యారావు వెంటనే ఆమదాలవలస --శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్కు చేరుకుని, అక్కడ తామాడ శంకర్రావును గుర్తించి సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనకు ధైర్యం చెప్పి, కౌన్సెలింగ్ నిర్వహించి, ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం ఆయనను స్నేహితుడు కర్రీ రమణ మరియు బంధువు మానేపల్లి ఎల్లాచారిలకు క్షేమంగా అప్పగించారు. సమయస్ఫూర్తితో స్పందించి ఒక యువకుడి ప్రాణాలను కాపాడిన డయల్-112 అత్యవసర సేవల సిబ్బంది మరియు పోలీసు కానిస్టేబుల్ (పీసీ-1847) సూర్యారావును జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ అభినందించారు. జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి జీవితంలో ఎలాంటి సమస్య వచ్చినా ఆత్మహత్య శాశ్వత పరిష్కారం కాదని, మానసిక ఆందోళన లేదా కుటుంబ సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించి సహాయం పొందాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-112కు సమాచారం అందించాలని, ప్రజల భద్రత,రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని జిల్లా ఎస్పీ తెలిపారు.

## వర్షాలు కురవాలని శ్రీ మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకం చేసిన గ్రామ సర్పంచ్ గొర్ల పల్లి అశోక్, గ్రామస్తులు





తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జులై 20

వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నందిగామ మండలంలోని ఉమ్మడి చేగూరు--వెంకమ్మగూడ గ్రామాల ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొర్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో అభిషేకం, జలాభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించి, వరుణదేవుడు కరుణించి మంచి వర్షాలు కురిపించాలని ప్రార్థించారు. పంటలు బాగా పండాలని, రైతులు ఇబ్బందులు పడకుండా ప్రకృతి అనుకూలించాలని భక్తులు వేడుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొర్లపల్లి అశోక్ మాట్లాడుతూ, వ్యవసాయమే గ్రామాల జీవనాధారమని, సమయానికి వర్షాలు కురిస్తే రైతుల కష్టాలు తీరడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. అందుకే గ్రామ ప్రజలందరూ కలిసి దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరూర్ సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండాల సాములయ్య, ఉప సర్పంచ్ వడ్డే యాదగిరి, వార్డు సభ్యులు చీర నరసింహ, స్వప్న విజయ్, వెంకమ్మగూడ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డే శ్రీను, పూజారి వీరేశం పంతులు, కుమ్మరి దేవప్ప, వడ్డె శ్రీనివాస్ బుయ్యని వేణుగోపాల్ గౌడ్, లక్ష్మయ్య గుప్త, చేగురి విశ్వనాథం, వెంకమ్మగూడ గ్రామపంచాయతీ మాజీ కోఆప్షన్ నెంబర్ చేవెళ్ల రాజయ్య, గణేష్, గుండాల మల్లేష్, కుమ్మరి మల్లేష్, కుమ్మరి రాజు, సిద్దు, ప్రవీణ్, రాజు, టీలు, శ్రవణ్, శ్రీను, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్సప్పగూడలో పోలీసుల అవగాహన సదస్సు పాల్గొన్న ఎస్సై దేవరాజ్, గ్రామ సర్పంచ్ రాజేశ్వరి శ్రీనివాస్,

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు కీలక సూచనలు

తెలుగు జ్యోతి న్యూస్షాద్ నగర్ ప్రతినిధి జులై 20







నందిగామ పోలీస్ స్టేషన్ సీఐ ప్రసాద్ ఆదేశాల మేరకు నందిగామ మండలంలోని నర్సప్పగూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వర శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై దేవరాజు హాజరై గ్రామస్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై దేవరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అలాగే సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. చిన్నారుల రక్షణకు పోక్సో చట్టం గురించి వివరించి, పిల్లలపై జరిగే నేరాలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూ వివాదాల విషయంలో చట్టపరమైన మార్గాలను అనుసరించాలని, స్వయంగా వివాదాలకు దిగకుండా పోలీసుల సహకారం తీసుకోవాలని గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు ఆసక్తిగా పోలీసుల సూచనలు విని, చట్టాలను గౌరవిస్తూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తామని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వర శ్రీనివాస్, ఉపసర్పంచ్ అప్పల సిద్దయ్య, వార్డు సభ్యులు, గ్రామ విపివో రాజశేఖర్, హెచ్సీ లక్ష్మీపతి, హెచ్సీ వెంకట్ నాయక్, పీసీ శ్రీశైలం, గ్రామస్తులు బంటారం లక్ష్మయ్య గౌడ్, గ్రామ యువకులు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## పెంజర్ల లో సిసి రోడ్ పనులు ప్రారంభించిన సర్పంచ్ జగన్



తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జులై 20

కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో ఎమ్మెల్యే నిధుల నుండి రూ. 7 లక్షలతో గ్రామపంచాయతీ నుండి హనుమాన్ టెంపుల్ వరకు సిసి రోడ్ పనులను సర్పంచ్ ఎర్రోళ్ల జగన్, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిడి భారతమ్మ,కటికె మైబూజి, గ్రామస్తులు డీలర్ రాజేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దేశాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్,కాంగ్రెస్ నాయకులు మామిడి అర్జున్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల సంరక్షణకు శ్రీకారం

మల్లాపూర్‌లో ఎంపీడీవో అరుంధతి, గ్రామ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి , చేతుల మీదుగా ప్రారంభం -- తడి, పొడి చెత్తను వేరు చేయాలని ప్రజలకు సూచన

తెలుగు జ్యోతి న్యూస్
షాద్ నగర్ ప్రతినిధి జులై 20



భూగర్భ జలాలను పరిరక్షించి భావితరాలకు నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో గ్రామాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు చేపడుతున్నామని కొత్తూరు ఎంపీడీవో సిహెచ్ అరుంధతి తెలిపారు. సోమవారం కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు, కంపోస్ట్ యార్డును ఎంపీడీవో అరుంధతి ప్రారంభించి పరిశీలించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్, డబ్బాలు, అట్టముక్కలు వంటి వ్యర్థాలను డీఆర్‌సీసీకి తరలించి రీసైక్లింగ్‌కు పంపిస్తామని తెలిపారు. తడి చెత్తను వర్మీ కంపోస్ట్ పిట్స్‌లో ప్రాసెస్ చేసి సేంద్రీయ ఎరువుగా మార్చడం ద్వారా గ్రామ పరిశుభ్రతతో పాటు రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులను మరింత పటిష్టంగా నిర్వహించి ప్రతి ఇంటి నుంచి చెత్తను క్రమం తప్పకుండా సేకరించాలని, వంద శాతం చెత్త విభజన అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సుహాసిని, ఎంపీఓ కృష్ణకాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ స్వరూప, పంచాయతీ కార్యదర్శి విక్రం రెడ్డి, వార్డు సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి, స్వాతి రాజేష్, సురేందర్ రెడ్డి, వరుణ్ గౌడ్, చిర్ర ప్రశాంత్, సంతోష్, నాయకులు పాపిరెడ్డి, పెంటా రెడ్డి, దామోదర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, విట్టల్ రెడ్డి, కమల్ రెడ్డి, చిర్ర సుదర్శన్, చిర్ర యాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



## సూరారం సీఐగా బాధ్యతలు చేపట్టిన కే బాలరాజుకు ఘన సన్మానం

శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసిన షేక్ జహంగీర్
ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్ష

కుత్బుల్లాపూర్, జూలై 20: కుత్బుల్లాపూర్



నియోజకవర్గంలోని సూరారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ కే బాలరాజు గారిని షేక్ జహంగీర్ కైసర్ నగర్ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ జహంగీర్ మాట్లాడుతూ, గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసిన కే బాలరాజు కరోనా మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి, శాంతిభద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, నిష్పాక్షికంగా పరిష్కరించే అధికారిగా ఆయన మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

మళ్లీ సూరారం పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టడం స్థానిక ప్రజలకు సంతోషకరమైన విషయమని తెలిపారు. ఆయన నాయకత్వంలో సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు మరింత పటిష్టమవడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం, పారదర్శకమైన పోలీసు సేవలు అందుతాయనే పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం కే బాలరాజు గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గతంలో చూపిన సేవాభావంతోనే ప్రజలకు న్యాయం చేస్తూ ఆదర్శవంతమైన పోలీసు అధికారిగా మరింత పేరు ప్రతిష్ఠలు సాధించాలని ఆకాంక్షించారు.

# దివ్యాంగుడి భూమిని కాజేసిన ప్రభుత్వ అధికారులను అరెస్టు చేయాలి.

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అమలు సాధన సమితి.**

హైదరాబాద్ జులై 20 (తెలుగు జ్యోతి ప్రతినిధి)

దివ్యాంగుడికి దక్కాల్సిన భూమిని కాజేసిన ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అమలు సాధన సమితి సోమవారం నాడు సిద్దిపేట జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి కోర్ కమిటీ మెంబర్ ఎం చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ అనంతసాగర్ గ్రామం చిన్నకోడూరు మండలంలోని సిహెచ్.రాజయ్యకు దక్కాల్సిన వారసత్వ భూమిని ఆయన సోదరుడు ప్రభుత్వ ఉద్యోగి లక్ష్మయ్య అక్రమంగా మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులకు అమ్మారని పేర్కొన్నారు. నంగునూరు మండలం రెవెన్యూ అధికారి పి. లింగయ్య అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటరామిరెడ్డి ముగ్గురు కలిసి దివ్యాంగులు భూమిని కుట్రపూరితంగా కాజేశారని దక్కాల్సిన ఆస్తులు కాజేశినందున వీరిపై దివ్యాంగుల చట్టం కింద చర్యలు తీసుకుని తక్షణమే అరెస్టు చేయాలని వారు ప్రజావాణిలో అధికారులను ని కోరారు. దివ్యాంగులు కోర్టుల చుట్టూ ఇతర సామాన్య ప్రజలకు సమానంగా కొట్లాడలేరనే దివ్యాంగుల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ చట్టం ద్వారా రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు స్పందించి ఈ ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు .దివ్యాంగుడు రాజయ్య కు దక్కాల్సిన భూమి తిరిగి అప్పజెప్పాలని వారు పిటిషన్ లో కలెక్టరేట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ కలెక్టరేట్ అధికారులు,పోలీస్ అధికారులు స్పందించకపోతే సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్రంలోని వికలాంగ సంఘాల అందరిది ఏకం చేసి ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.ఈ విషయం పై రాజయ్య గారి ఎన్నిసార్లు కలెక్టరేట్ ఆర్డీవో కార్యాలయ చుట్టూతిరిగినకనీసంస్పందించకపోవడాన్ని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు.దివ్యాంగులకు సంబంధించి ఇతర జిల్లాలో జరుగుతున్న న్యాయం సిద్దిపేట జిల్లాలో జరగడంలేదని పేర్కొంటూ ప్రభుత్వ అధికారులు చేస్తున్న మోసాలను దౌర్జన్యాలను సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ అధికారులు ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తుందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టరేట్ అధికారులు స్పందించి ప్రభుత్వ ఉద్యోగులైన రెవెన్యూ అధికారి లింగయ్య, టీచర్లు లక్ష్మయ్య,వెంకట రామ్ రెడ్డి చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు


Congress Election Manifesto
Amalu Sadana Samithi
Address: Sir Louies Braille Park, Malakpet, Hyderabad, Telangana. Phone: 9247887585

To,
The Chief Secretary,
Government of Telangana,
Secretariat, Hyderabad.

20/7/2026

The Director General of Police (DGP),
Telangana State, Hyderabad.
District Collector, Siddipet Dt
The Commissioner,
Welfare of Persons with Disabilities (Disabled Rights Commissioner),
Telangana State, Hyderabad.
From:
Cheruku Nagabushanam,
Chairman, Congress election Manifesto Amalu Sadhana Samithi,
Telangana State.

SUBJECT:
Request for immediate criminal action, arrest under the Rights of Persons with Disabilities Act, 2016, and strict disciplinary action against complicit police personnel – Serious case of land grabbing, forgery, illegal mutation of agricultural land belonging to a disabled person (Divyangjan), and illegal harassment of supporting family members – Survey Nos. 388, 389, 390, and 391, Anantha Sagar Village, Chinna Kodur Mandal, Siddipet District – Regarding.

VICTIM DETAILS:
Name: Ch. Rajaiah (S/o Shankaraih)
Status: Divyang Person (Person with Disability)
Current Residence: Settled in Hyderabad



# ఘనంగా వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు








తెలుగుజ్యోతి
శేరిలింగంపల్లి, జూలై 20 :

శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు జన్మదిన వేడుకలు సోమవారం వైశాలినగర్లో ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచే అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సందడితో జన్మదిన వేడుకలు ఉత్సాహంగా సాగాయి. హరీష్ రావుకు పూలమాలలు వేసి, బొకేలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, గోపరాజు శ్రీనివాస్ రావు, సంగారెడ్డి, బాబుమోహన్ మల్లేష్, దీప్తి రాజు, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, ధాత్రినాథ్ గౌడ్, శ్రీనివాస్, బండి రామకృష్ణ గౌడ్, గణేష్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అనిల్ రెడ్డి, యాదయ్య, శేఖర్ యాదవ్ తదితరులతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని వాలా హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమ కట్టడాలకు చెక్.. శివాలయ నగర్‌లో రెవెన్యూ అధికారుల కూల్చివేతలు





**సర్వే నంబర్--49 ప్రభుత్వ భూమిలో ఏ నిర్మించిన అక్రమ కట్టడాల తొలగింపు**
**స్థానికుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు**
**అక్రమ నిర్మాణాలను ఏమాత్రం ఉపేక్షించబోమన్న డిప్యూటీ ఎమ్మార్వో సుధాకర్**
**ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**
**గతంలో కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు.. మరోసారి బుల్డోజర్లతో కూల్చివేతలు**

తెలుగు జ్యోతి న్యూస్ కుత్బుల్లాపూర్: జూలై 20

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని శివాలయ నగర్లో సర్వే నంబర్--49లో ప్రభుత్వ భూమిపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. డిప్యూటీ ఎమ్మార్వో సుధాకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) కలీం ఆధ్వర్యంలో ఈ కూల్చివేతలు చేపట్టారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఎమ్మార్వో సుధాకర్ మాట్లాడుతూ, సర్వే నంబర్--49 పూర్తిగా ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. భవిష్యత్తులో ఎవరైనా ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించినా, అలాంటి నిర్మాణాలను ప్రోత్సహించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇదే ప్రాంతంలో గతంలో కూడా అక్రమ కట్టడాలను తొలగించినప్పటికీ, మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో మరోసారి కూల్చివేత చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ కట్టుబడి ఉందని, ఆక్రమణలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తామని సుధాకర్ పేర్కొన్నారు.ఈ కూల్చివేతల సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొని చర్యలను పర్యవేక్షించారు. స్థానికులు రెవెన్యూ శాఖ చర్యలను స్వాగతిస్తూ, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని అధికారులను కోరారు.

# మియాపూర్ లో యలమంచి ఉదయ్ కిరణ్ దంపతులు నిర్వహించిన రాజశ్యామల యాగం





**శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్,పలువురు ప్రముఖులు కాలనీ వాసులు ..**

తెలుగుజ్యోతి, మియాపూర్ జులై 20:

మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్.ఆర్. ఎస్టేట్స్ కమ్యూనిటీ హాల్‌లో గంగాధర శాస్త్రి , శ్రీమతి రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా, మియాపూర్ యువ నాయకులు, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ శ్రీమతి నవ్యశ్రీ దంపతులు నిర్వహించిన రాజశ్యామల యాగం మరియు శ్రీ వారాహి అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.అనంతరం జగదీశ్వర్ గౌడ్ వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్ల సంజీవ్ రెడ్డి, వీరేంద్ర గౌడ్, కృష్ణ, మన్నెపల్లి సాంబశివరావు, కేవీ రావు, రాచమల్ల కృష్ణ గౌడ్ దంపతులు, రవి కుమార్, కావూరి ప్రసాద్, రవీంద్ర రెడ్డి, అశోక్ గౌడ్, వెంకటేశ్వర్లు, బాబ్జీ, సింధూర సుధీర్, ఎం.డి. షా, కేశవరావు, సత్య రెడ్డి, మూర్తి, పద్మిని ప్రియదర్శిని, సత్యనారాయణ, సాంబయ్య, చక్రపాణి, శంకర్ చారి, రామకృష్ణ, రవి కృష్ణ, శ్రీనివాసు, సుధీర్, చిరంజీవి, రాజేష్, నరేంద్ర రెడ్డి, కామినేని వాసు, వంశీ, రత్నాచారి, శశి, సతీష్, ప్రవీణ్, సీనియర్ సిటిజన్స్ గోపీనాథ్, సుబ్బారాయుడు, బాబు, రమణ, నాయుడు, సుబ్బ రెడ్డి, మురళి, రాజు, బాలమురళి, నవీన్, రాజేశ్వరి, పద్మతో పాటు పలువురు నాయకులు, భక్తులు, స్థానిక నివాసితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హత్య చేసి ఆనవాళ్లు చెరిపే యత్నం.. నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

**జీడిమెట్ల పోలీసుల పకడ్బందీ దర్యాప్తుకు ఫలితం..**
**మెడ్చల్-II అదనపు జిల్లా ఏ సెషన్స్ కోర్టు సంచలన తీర్పు**

తెలుగు జ్యోతి న్యూస్ జీడిమెట్ల, జూలై 20



జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన సంచలన హత్య కేసులో మెడ్చల్-II అదనపు జిల్లా ఏ సెషన్స్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. హత్య అనంతరం నిప్పంటించి నేర ఆనవాళ్లను చెరిపివేయాలని యత్నించిన కేసులో నిందితుడు లిభునేశ్వర్ సింగ్ (46)లను అన్ని అభియోగాల్లో దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించింది.పోలీసుల వివరాల ప్రకారం, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 613/2022గా ఐపీసీ సెక్షన్లు 302, 436, 201 కింద కేసు నమోదు కాగా, విచారణ అనంతరం మెడ్చల్-II అదనపు జిల్లా ఏ సెషన్స్ కోర్టు (ఎస్‌సీ నంబర్ 297/2023) న్యాయమూర్తి జి. భానుమతి సోమవారం తీర్పు వెల్లడించారు.విచారణలో సమర్పించిన ప్రత్యక్ష, పరోక్ష సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన కోర్టు, నిందితుడు హత్య చేసి అనంతరం మృతదేహానికి నిప్పంటించి నేర ఆధారాలను నాశనం చేయడానికి ప్రయత్నించినట్లు నిర్ధారించింది.దీంతో ఐపీసీ సెక్షన్ 302 కింద యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించింది. సెక్షన్ 436 కింద 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా, జరిమానా చెల్లించకపోతే ఒక నెల సాధారణ కారాగార శిక్ష విధించింది. అలాగే సెక్షన్ 201 కింద మూడు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల సాధారణ కారాగార శిక్షను ఖరారు చేసింది.ఈ కేసు దర్యాప్తును అప్పటి సబ్‌ఇన్‌స్పెక్టర్లు కె. గౌతమ్, ఎ. హరీష్ ప్రారంభించగా, అనంతరం ఇన్‌స్పెక్టర్ ఎం. పవన్ దర్యాప్తును పూర్తి చేశారు. ప్రస్తుతం జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓగా ఉన్న కె. రవికుమార్ పర్యవేక్షణలో కేసు విచారణ విజయవంతంగా పూర్తయింది.కోర్టులో ప్రభుత్వ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. విజయ్ రెడ్డి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సమన్స్ సిబ్బంది బి. నాగరాజు, బి. సత్తయ్య, వెంకటేష్, సీడీఓ జె. శ్రీనివాస్, లియాజన్ అధికారి ఎం. ఓబులమ్మ కేసు నిర్వహణలో కీలక సమన్వయం అందించారు. ఈ తీర్పుతో హత్య చేసి ఆధారాలను నాశనం చేయాలని ప్రయత్నించినా చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరనే స్పష్టమైన సందేశం సమాజానికి వెళ్లిందని పోలీసు అధికారులు తెలిపారు. జీడిమెట్ల పోలీసుల శాస్త్రీయ దర్యాప్తు, పటిష్ఠమైన సాక్ష్యాధారాల సేకరణ, ప్రాసిక్యూషన్ సమర్థవంతమైన వాదనల ఫలితంగానే నిందితుడికి కఠిన శిక్షలు ఖరారయ్యాయని పేర్కొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలకు పెద్దపీట





మేడ్చల్--మల్కాజిగిరి ఐడీఓసీలో 84 అర్జీలు స్వీకరణ..

త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశం

తెలుగు జ్యోతి న్యూస్ మేడ్చల్, జూలై 20

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం సోమవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఐఏఎస్, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాలతితో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సమస్యలు, వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 84 అర్జీలు అందగా, ప్రతి వినతిపత్రాన్ని కలెక్టర్ పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి సత్వర చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# సింగరేణి సూపర్ బజార్ పునర్నిర్మాణం చేపట్టాలి

ఖాళీ చేస్తున్న క్వార్టర్లు కూలగొట్టకుండా చూడాలి

జిఎంకి వినతి పత్రం అందించిన కార్పొరేటర్ మునిగడప పద్మ

భద్రాద్రి కొత్తగూడెం(తెలుగు జ్యోతి న్యూస్):





కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం 16వ డివిజన్ లోని పాత సూపర్ మార్కెట్ ఏరియాలో నూతన బిల్డింగ్ నిర్మాణం చేసి రామవరం ప్రాంత అభివృద్ధికి సహకరించాలని రుద్రంపూర్ ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ షాలెం రాజుకి 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామవరం ప్రాంతం గతంలో సింగరేణి కార్మికులతో కలకలాడుతుండేదని ఆనాటి వైభవం నేడు లేదని అన్నారు. మరల పూర్వ వైభవం కోసం మార్కెట్ ఏరియాలో గల పాత సూపర్ మార్కెట్ లో నూతన భవనం నిర్మాణం చేపట్టి దానిలో సూపర్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని కోరారు. తద్వారా దాని చుట్టూ ఉన్నటువంటి కూరగాయలు పండ్లు పూలు ఇతర షాపులు నడుపుకునే వారికి జీవనోపాధికి ఉపయోగపడేటట్లుగా నిర్మాణం చేయడం ద్వారా చాలామందికి ఉపాధి మార్గాలు దొరుకుతాయని ఆమె వివరించారు. దీనిపై స్పందించిన జిఎం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు ఇచ్చిన వినతి ప్రకారం కొత్తగూడెం, రామవరం సింగరేణి సూపర్ బజార్ల నిర్మాణం ఫైల్ అండర్ ప్రాసెస్ లో ఉందని జిఎం అన్నారని ఆమె తెలిపారు. అలాగే కార్మికులు ఖాళీ చేసిన క్వార్టర్లను కూలగొట్టడం ద్వారా ఆసాంఘిక, క్రిమి కీటకాలకు నిలయంగా మారుతున్నాయని జిఎం దృష్టికి తీసుకెళ్లారు. క్వార్టర్లను కూలగొట్టే విధానాన్ని ఆపాలని పేదవారికి ఉపయోగపడే విధంగా చూడాలని వినతి పత్రంలో కోరారు. అలాగే మహిళా సంఘాల స్వయం ఉపాధి శిక్షణకు, వారి సమావేశాలకు ఉపయోగపడే విధంగా ఒక క్వార్టర్ను కేటాయించాలని జియం దృష్టికి మునిగడప పద్మ తీసుకెళ్లారు. అలాగే అంబేద్కర్ చమన్ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి రామవరం ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా ఉండేటట్లు సహకరించాలని జిఎంకి వివరించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో న్యాయవాది, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, వనం దాస్ గడ్డ శాఖ టు కార్యదర్శి ఎస్కే జలీల్ తదితరులు ఉన్నారు.

# నైషా విజ్ఞాన ప్రతిభ తెలంగాణకే గర్వకారణం

అభ్యుదయ కళా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు

ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్

ర్యాంకు సాధించిన నైషాకు ఘన సన్మానం

భద్రాద్రి కొత్తగూడెం(తెలుగు జ్యోతి న్యూస్):









నైషా విజ్ఞాన ప్రతిభ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం అని అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పేర్కొన్నారు. ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ కు స్టూడెంట్ అయిన మెడికేర్ డయాగ్నస్టిక్స్ అధినేత డాక్టర్ ప్రవీణ్ కుమార్తె నైషా "నీట్ "పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం పట్ల పలువురు అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక గణేష్ టెంపుల్ వద్ద గల మెడికేర్ డయాగ్నొస్టిక్ సెంటర్లో సోమవారం నైషా తల్లిదండ్రులు మిత్రులు శ్రేయోభిలాషులు మెడికేర్ సిబ్బంది సమక్షంలో నైషాకు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ర్యాంకు సాధించిన నైషా భవిష్యత్తులో ఇంకా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి మన కొత్తగూడెం కీర్తి ప్రతిష్టలను దేశవ్యాప్తంగా ఇనుమ డింప చేయాలని ఆశీర్వదించారు. అనంతరం ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ను డాక్టర్ ప్రవీణ్ దంపతులు శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శిరీష, సన్మాన గ్రహీత కుమారి నైషాలతో పాటు అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, మరొక రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్, రాష్ట్ర మైనార్టీ నాయకులు సల్మాన్ ఖాన్ తోత, గోపీ, మెడికేర్ సిబ్బంది డాక్టర్ కవిత, రామ్ చందర్, లోకేష్, సంతోష్, రజని తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు వెంటనే అమలు చేయాలి..
## ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలి:
## ఉమా మహేష్



జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ భూముల పరిరక్షణకు సీపీఐ డిమాండ్

తెలుగు జ్యోతి న్యూస్ జగద్గిరిగుట్ట, జూలై 20

జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన సుమారు 14 ఎకరాల భూమిని హైకోర్టు తీర్పు మేరకు వెంటనే స్వాధీనం చేసుకొని ఆలయ అధీనంలోకి తీసుకురావాలని సీపీఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ, ఆలయ భూముల విషయంలో హైకోర్టు ఈ ఏడాది మే నెలలో స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు అమలు చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. తీర్పు అమలులో జాప్యం కొనసాగితే మిగిలిన ఆలయ భూములు కూడా ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ ఆస్తులను పరిరక్షించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్న ఆయన, హైకోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేసి ఆలయానికి చెందిన భూములను స్వాధీనం చేసుకుని రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఆక్రమణలను పూర్తిగా అరికట్టి ఆలయ ఆస్తులను కాపాడేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, బాబు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి..

బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి





తెలుగుజ్యోతి,బచ్చన్నపేట జులై 20:

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఇటికాలపల్లి గ్రామానికి చెందిన రైతు మ్యాక మల్లేశంకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. రోజూలాగే వ్యవసాయ పొలం వద్ద ఆవులను మేపుతున్న సమయంలో రామచంద్రపురం గ్రామంలోని దుర్గమ్మ గుడి సమీపంలో నేలకు చాలా కిందికిగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మేత కోసం వెళ్లిన ఆవు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. మృతి చెందిన ఆవు విలువ రూ.90 వేలకుపైగా ఉంటుందని, దీంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్థులు ఆరోపించారు. నేలకు అత్యంత సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే రక్షణ కంచెలు ఏర్పాటు చేసి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. అలాగే విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన నేపథ్యంలో బాధిత రైతుకు విద్యుత్ శాఖ ద్వారా తగిన నష్టపరిహారం అందించి, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బి.ఆర్.ఎస్ నాయకుడు మందుల రాధాకృష్ణ.

తెలుగు జ్యోతి న్యూస్ జూలై 20

సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.



సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మందుల రాధాకృష్ణ సోమవారం డిసిసి అధ్యక్షురాలు తూర్పు నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాధాకృష్ణ కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తూర్పు నిర్మాణా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాలత్వంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్ గౌడ్, సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జార్జ్ , నాయకులు సంతోష్ , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేష్ ముదిరాజ్, తో పాజి హరీష్ ,నగేష్ , సంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గంగేరి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223

# ఆకలితో అల్లాడుతున్నాం...

- నాలుగు నెలల నుండి ఇదే పరిస్థితి
- మాకు బువ్వ పెట్టండి
- సౌకర్యాలు లేక చదువుకి ఆటంకాలు
- భోజనం పెట్టడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు ఆందోళన

భద్రాద్రి కొత్తగూడెం(తెలుగు జ్యోతి న్యూస్):



ఆకలితో అల్లాడిపోతున్నాం.. గత నాలుగు నెలల నుండి ఇదే పరిస్థితి ఉంది.. మాకు కడుపునిండా బువ్వ పెట్టి ఆకలి తీర్చాలని.. చదువుకునేందుకు సకల సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటూ విద్యార్థులు నిరసన బాట పట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిధిలోని కలెక్టరేట్ పక్కన ఉన్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ హాస్టల్ లో చదువుతున్న వారికి భోజనం పెట్టడం లేదని ఆరోపిస్తూ సోమవారం యూనివర్సిటీ ఆవరణలో విద్యార్థులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గత కొద్ది నెలల నుండి తమకు భోజనం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దిక్కు ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని చెబుతున్నప్పటికీ ఇక్కడి యూనివర్సిటీలో అందుకు విరుద్ధంగా వాతావరణం కనిపిస్తుందని అసహనం వ్యక్తపరిచారు. భోజనం లేక అల్లాడిపోతున్నామని ఆరోగ్యపరంగా కూడా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని విద్యార్థులు వివరించారు. చదువుకునేందుకు కంప్యూటర్లు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. హాస్టల్లో వసతులు సక్రమంగా లేవని వివరించారు. రాత్రి సమయంలో ఆరోగ్యపరంగా ఇబ్బంది పడితే తమకు వైద్య సేవలు కూడా అందే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. చుట్టూ చెట్లు ఉండడం మూలంగా రాత్రి సమయంలో యూనివర్సిటీ ఆవరణలో విష సర్పాలు సంచరిస్తున్నాయని వీటివల్ల తమకు పెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. హాస్టల్ కు సంబంధించిన మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ఉంటున్న హాస్టల్ విద్యార్థులకు ప్రతిరోజు రుచికరమైన భోజనంతోపాటు వ్యాధుల సీజన్ దృశ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. హాస్టల్ భవనంలోని మరుగుదొడ్లను బాగు చేయడంతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యం

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు
రామవరంలో సింగరేణి డిస్పెన్సరీని పునఃప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం(తెలుగు జ్యోతి న్యూస్):

సింగరేణి కార్మికులకు వారి కుటుంబాలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని సింగరేణి డైరెక్టర్ పి అండ్ పి వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవారంలో ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన డిస్పెన్సరీని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో డిస్పెన్సరీని ఆధునీకీకరించి తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ మాట్లాడుతూ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిస్పెన్సరీలో ఒక స్టాఫ్ నర్స్ ను నిరంతరం అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన వైద్య సేవలు మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్**

ఎం.షాలేం రాజు మాట్లాడుతూ రామవరంలో పునరుద్ధరించిన డిస్పెన్సరీ ద్వారా ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని ఈ వైద్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**వికేసిఎంలో నూతన క్రేన్ల ప్రారంభం**

వీకేసీఎంలో నూతనంగా కొనుగోలు చేసిన నాలుగు క్రేన్లను సోమవారం డైరెక్టర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ క్రేన్ల వినియోగంతో గని నిర్వహణ పనులు మరింత వేగవంతంగా సమర్థవంతంగా సాగడంతో పాటు భద్రతా ప్రమాణాలు ఉత్పాదకత మరింత మెరుగుపడుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రేన్లు భారీ యంత్ర పరికరాల తరలింపు నిర్వహణ పనులను సులభతరం చేస్తాయని ఉత్పాదకతలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు . ఆధునికరణకు సింగరేణి సంస్థ నిరంతరం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వికెసిఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి.నరసింహారావు, ఏరియా ఇంజనీర్ వి.రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, డిజిఎం(ఐఈడి) యోహాన్, ఏఐటీయూసి సెంట్రల్ సెక్రెటరీ వంగా వెంకట్, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్



ఎండి.రజాక్, రామవరం కార్పొరేటర్ కె.జమలయ్య, ఎస్.ఓ టు జీఎం ఎం.గోవిందరావు, (సిఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఇన్‌చార్జ్ హెచ్ ఓ డి (సివిల్) రాజారాం, మేనేజర్ (ఐటిగ) శేష శ్రీ, డివైపిఎం హరీష్, ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఐఎన్టియుసి ఫిట్ సెక్రెటరీ సాగర్, అధికారులు, వైద్యాధికారులు, వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాత కొత్తగూడెం వైద్యశాలకు సౌకర్యాలు కల్పించాల్సిందే

- అదనంగా సిబ్బందిని నియమించాలి
- ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలి
- స్టేషనరీ కొనుగోలుకు నిధులు ఇవ్వాలి
- భవనం లీకేజీలను సరి చేయాలి
- ప్రజావాణిలో పివైఎల్ పిఓడబ్ల్యు సంఘాల వినతి
- "తెలుగు జ్యోతి" వార్తకు స్పందన

భద్రాద్రి కొత్తగూడెం(తెలుగు జ్యోతి న్యూస్):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్పొరేషన్ పరిధిలో ఉన్న పాత కొత్తగూడెం ఏరియాలో గతంలో ఏర్పాటు చేసిన వైద్యశాలకు ప్రస్తుతం సమస్యల తాకిడి ఎక్కువగా ఉందని ప్రధానమైన సమస్యలను వెంటనే పరిష్కరించ డంతోపాటు అదనంగా సిబ్బందిని నియమించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పివైఎల్ పిఓడబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తెలుగు జ్యోతి దినపత్రికలో "వైద్య సేవలు సరే.. సమస్యలు తీర్చేదేన్నడు" అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి పై రెండు సంఘాల స్పందించి పాత కొత్తగూడెం ఆసుపత్రిలో తక్షణమే సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మాట్లాడుతూ పాత కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి కావలసిన సౌకర్యాలతో పాటుగా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి ప్రహరీ గోడ కూలిపోయి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు ఆ గోడకు మరమ్మత్తులు చేయలేదన్నారు. గోడ కూలి ఉండడంవల్ల ఆసుపత్రి లోపలికి పశువులు వచ్చి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాటిన మొక్కలను సైతం పశువుల ధ్వంసం చేయడం జరిగిందన్నారు. వర్షాకాలం


తెలుగు జ్యోతి
వైద్య సేవలు సరే.. సమస్యలు తీర్చేదెన్నడు?

కావడంతో వైద్యశాల భవనం కురుస్తుందని కారణంగా మందులు నిల్వచేసే గది అపరిశు భ్రంగా మారిందన్నారు. మందులను నిలువచేసే గదిని రిపేర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవనానికి సైతం రంగులు వేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రికి అవసరమయ్యే స్టేషనరీని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యశాల ఓకే వైద్యుడుతో నడుస్తుందని మరో వైద్యుని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా ఒక స్టాఫ్ నర్స్ తో పాటు వాచ్మెన్ ఆయాను సైతం ఏర్పాటు చేయాలన్నారు. కరోనా కాలంలో ఎంతోమందికి పాత కొత్తగూడెం ఆసుపత్రి వైద్య సేవలు అందించిందని అలాంటి ఆసుపత్రిని నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే సదుపాయాలను కల్పించడం తోపాటు సిబ్బందిని నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నరేష్, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పెద్ద గ్రోని ఆదిలక్ష్మి, నాయకులు ఎం.వంశీ, జీవన్, సాగర్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో శక్తి కేంద్రాలు ఏర్పాటు



56వ డివిజన్ శక్తి కేంద్రం ఇన్చార్జిగా బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గాయత్రి

భద్రాద్రి కొత్తగూడెం(తెలుగు జ్యోతి న్యూస్):

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "సర్" ఎన్నికల ప్రక్రియను అర్థమయ్యే విధంగా చెప్పేందుకు వీలుగా బిజెపి ఆధ్వర్యంలో శక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. సోమవారం బిజెపి అనుబంధ మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ లో శక్తి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ శక్తి కేంద్రానికి ఇన్చార్జిగా ఉన్న జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గాయత్రి మాట్లాడుతూ బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అయితేకేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల సమక్షంలో జిల్లా అధికారులు నిర్వహిస్తున్న" సర్" సహాయ కేంద్రం ద్వారా సామాన్య ఓటర్లను సైతం కాపాడుకునే విధానంపై చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. 56వ డివిజన్ పరిధిలో గల అజ్మత్ కిరాణా షాపు వద్ద 139, 140, 141, 142 బూత్ ఓటర్లకు "సర్" సహాయ కేంద్రం, ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్క ఓటర్ ఇప్పటి వరకు ఇంకా ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోని వారు ఈ సహాయ కేంద్రాల వద్దకు వచ్చి బిఎల్వో లు తమకు ఇచ్చిన ఫారాలను పూర్తి చేసుకుని తప్పకుండా తమ వివరాలని సంబంధింత బిఎల్ఓ అధికారులకు ఇచ్చి తమ ఓటు హక్కు పత్రాలను బి ఎల్ ఓ లకి అంద చేయవలసిందిగా కోరడం జరిగింది. ప్రతి ఓటరుకు అవగాహన కల్పిస్తూ వారికి సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, బిజెపి ఆఫీస్ సెక్రెటరీ దురిశెట్టి కుమార్, బి.ఎల్.ఓ.2 పిల్లి వేణు వాసవరావు, బి ఎల్ ఓ శైలజ, గౌసియా, జ్యోతి, అలాగే స్థానిక ఓటర్లు గౌస్, హమీద బేగం, వినయ్ కుమార్, సుప్రజ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలి: కొలన్ హనుమంత్ రెడ్డి



కొంపల్లిలో ఎస్ ఐ ఆర్-2026 ప్రత్యేక ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇన్‌చార్జి

తెలుగు జ్యోతి న్యూస్ కొంపల్లి: జూలై 20

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి పరిధిలో నంది చౌక్ పార్క్, జయభేరి పార్క్‌లలో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ -2026 ప్రత్యేక ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వ్యక్తిగత వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని పేర్కొంటూ, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ ఐ ఆర్ -2026 కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, డీసీసీ కమిటీ జనరల్ సెక్రటరీ బైరి ప్రశాంత్ గౌడ్, అన్నారం గోపాల్ రెడ్డి, జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి గోపాల్ రెడ్డి, ఏ-బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేణుక అశోక్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏరోళ్ల కృష్ణ, ఎస్.కె. ఇబ్రహీం, శ్రీనివాస్‌తో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ కార్యాలయంలో ఎమ్.డి. అజాం జన్మదిన వేడుకలు

శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసిన అనిల్ కుమార్ యాదవ్
కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు
సమాజ సేవలో అజాం సేవలను కొనియాడిన అనిల్ కుమార్ యాదవ్

శేరిలింగంపల్లి, జులై 20 (తెలుగు జ్యోతి):



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మసీద్‌బండలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి జనరల్ సెక్రటరీ ఎమ్.డి. అజాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ ఎమ్.డి. అజాంను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అజాం తన మిత్రుడు, శ్రేయోభిలాషి, సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసే నిస్వార్థ, నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడిగా ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్, మారబోయిన మహేష్ యాదవ్, ఇమ్రాన్, డేవిడ్, ఆకాష్ తదితరులు పాల్గొని ఎమ్.డి. అజాంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# సేవతో శిఖరానికి... డా. కీర్తన యాదవ్‌కు ఐఎంఏ జాతీయ కమ్యూనిటీ సేవా పురస్కారం

**తెలంగాణకు అరుదైన గౌరవం**
**దేశవ్యాప్తంగా ఎంపికైన 25 మంది వైద్యుల్లో స్థానం**
**సామాజిక సేవకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక పురస్కారం**

హైదరాబాద్ , జూలై 18 (తెలుగు జ్యోతి):




తెలంగాణకు చెందిన యువ వైద్యురాలు డా. ఎన్. కీర్తన యాదవ్ ప్రతిష్ఠాత్మక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ కమ్యూనిటీ సేవా పురస్కారం అందుకుని రాష్ట్రానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చారు.దేశవ్యాప్తంగా అందిన నామినేషన్లలో కేవలం 25 మంది వైద్యులను మాత్రమే ఈ పురస్కారానికి ఎంపిక చేయగా, ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ గౌరవం దక్కింది. తెలంగాణ నుంచి డా. కీర్తన యాదవ్ ఎంపిక కావడం విశేషం.
న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మధ్యప్రదేశ్ ఎంపీ మయాంక్ నాయక్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.
ప్రస్తుతం ఉస్మానియా వైద్య కళాశాలలో అనస్థీషియాలజీ విభాగంలో సహాయ ఆచార్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డా. కీర్తన యాదవ్, డా. నారి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలిగా ఉచిత వైద్య శిబిరాలు, సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలు, మహిళా సాధికారత, యువతలో ఆరోగ్య అవగాహన, మధ్యతరగతి కుటుంబాల కోసం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ విశేష గుర్తింపు పొందారు.సామాజిక సేవా రంగంలో ఆమె అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా లభించిన ఈ జాతీయ పురస్కారం తెలంగాణ వైద్య రంగానికి గర్వకారణంగా నిలిచింది. చిన్న వయసులోనే ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందుకోవడం ద్వారా డా. కీర్తన యాదవ్ యువ వైద్యులకు ఆదర్శంగా నిలిచారని పలువురు అభినందించారు.

# పోచమ్మ ఆలయ నిర్మాణంలో కీలక ఘట్టం స్లాబ్ పనులకు శ్రీకారం.



**అంబేద్కర్ కాలనీలో వేగంగా కొనసాగుతున్న ఆలయ నిర్మాణం.**
**బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి.**

తెలుగు జ్యోతి దినపత్రిక జులై 20 సంగారెడ్డి స్టాప్ రిపోర్టర్.

సంగారెడ్డి జిల్లా,మున్సిపాలిటీ పరిధిలోనీ అంబేద్కర్ కాలంలో నిర్మాణంలో ఉన్న శ్రీ పోచమ్మ దేవాలయం మరో కీలక దశకు చేరింది. బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తమ సొంత నిధులతో నిర్మిస్తున్న ఈ ఆలయ స్లాబ్ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ కుమార్ గౌడ్తో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఆలయ నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తిచేసి త్వరలోనే భక్తులకు అంకితం చేయడమే లక్ష్యమని తెలిపారు. అంబేద్కర్ కాలనీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయనిర్మానాన్ని చేపట్టామని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్య వే క్షిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం సరైన సాగుతుండడంతో స్థానికులు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రమేష్, కుమార్ గౌడ్ నాయకులు వెంకటరామిరెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు తుడుంరవి, డప్పు శీను, తుడుంరాజు, లింగం ,రాజు సుధాకర్ ,అర్జున్ ,కె రమేష్ కాలనీవాసులు, అంబేద్కర్ సంఘం సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ డి ప్రేమానందం సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం.

**వాటర్ షెడ్ మాజీ కార్యదర్శి, పంచాయతీ మెంబర్, డి విద్య ఆనందం ,ఎం కిష్టయ్య.**

తెలుగు జ్యోతి దినపత్రిక 20 జూలై సంగారెడ్డి ప్రతినిధి.

సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి నియోజకవర్గశీ, సంగారెడ్డి పట్టణంలో ఈరోజు ఈ మధ్యనే డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ డి ప్రేమానందం సన్మానించి, స్వీట్ తినిపించి శు భాకాంక్షలు తెలియజేసిన పట్నం మాణిక్యం (గ్రా వీ ఖ) పిఎంకె ఫౌండేషన్ చైర్మన్, వారితోపాటు గోపులారం వాటర్ షెడ్ మాజీ సెక్రెటరీ, దళిత బహుజన జిల్లా నాయకులు డి విద్యానందం, పంచాయతీ మెంబర్ ఎం కిష్టయ్య, దళిత మండలం నాయకులు, డి సుధీర్ కుమార్, డి రాహుల్, రమేష్ ముదిరాజ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొని శాలువాతో పూలమాలతో సత్కరించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్నం మాణిక్యం డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా వైస్ చైర్మన్ వారు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా విద్యార్థి దశ నుంచి సామాజిక ఉద్యమ కారునిగా, ఉద్యమాలు, పోరాటాలు చేపడుతూ సామాజిక న్యాయం కోసం ఉద్యమాలు చేసినారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా చురుకుగా పాల్గొన్నారు. దళిత, గిరిజన ,బడుగు వర్గాల ప్రజల కోసం అనేక ఉద్యమాలు చేపట్టినారు. వివిధ దళిత బహుజన ప్రజా సంఘాలతో పాటు, రాజకీయ పార్టీలలో పనిచేస్తూ ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం తనకు తోచిన విధంగా సహాయపడినారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిషన్ డైరెక్టర్ గా, సదాశివపేట మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా పనిచేసిన సమయంలో దళిత గిరిజనుల కోసం వారి సంక్షేమం కోసం అభివృద్ధి కోసం, విద్యార్థినీ విద్యార్థుల సమస్యలపై, ప్రభుత్వ అధికారుల ప్రజా ప్రతినిధికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి సదాశివపేట (గ్రా వీ జ ) డైరెక్టర్గా పనిచేసిన సమయంలో, రైతుల సమస్యలపై, వ్యవసాయ అధికారుల దృష్టికి రైతులను సమస్యలు తీసుకెళ్లి వారి సమస్యలు తీర్చులకు తీర్చుటకు ముందు ఉన్నారు. అందువలన (ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసర్చ్ స్ఫూర్తి అకాడమీ )వారు, డాక్టర్ ఆకుల రమేష్, మరియు డాక్టర్ చిన్నారెడ్డి, వారి బృందం డి ప్రేమానందం చేసిన సామాజిక సేవలను ఉద్యమాలను గుర్తించి, వారికి గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రధానం చేసినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ ప్రేమానందం మాట్లాడుతూ నన్ను గౌరవ డాక్టరేట్ గా గుర్తించి గౌరవ డాక్టరేట్ అవార్డు ప్రధానం చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు, డాక్టరేట్ అవార్డు ఇచ్చిన తర్వాత నా పైన బాధ్యత పెరిగింది అన్నారు, నేను మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సామాజిక సేవలో ముందు ఉంటానని, పేద అట్టడుగు వర్గాల , పేద ప్రజల సమస్యల కోసం ప్రభుత్వ అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కరించడానికి ముందుంటానన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో, విద్యార్థుల సమస్యపై, నిరుద్యోగుల సమస్యలపై, రైతుల సమస్యలపై, మహిళల సమస్యలపై, ఎప్పటికప్పుడు దృష్టి







పెట్టి వారి సమస్యలను తీర్చుటకై ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగే వరకూ కృషి చేస్తానని తెలియజేశారు.

# శ్రీ జగన్నాథ స్వామి రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్వరరావు దేశ్ పాండే, ఎం ఎల్ సి అంజిరెడ్డి,





సంగారెడ్డి జిల్లా ,సంగారెడ్డి నియోజకవర్గ0 సదాశివపేట పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్సి చిన్న చిన్న మెయిల్ అంజిరెడ్డి ,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్ పాండే పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు , జిల్లా బిజెపి నాయకులు,మండల నాయకులు, కార్యకర్తలు, వేద పండితులు, పట్టణ ప్రజలు, వివిధ గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

# సదాశివపేట లో శ్రీ జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు తూర్పు నిర్మల జగ్గారెడ్డి.

**సదాశివపేట పట్టణంలో (ఇస్కాన్) ఆధ్వర్యంలో వైభవంగా జగన్నాథ రథయాత్ర.**

తెలుగు జ్యోతి దినపత్రిక 20 జూన్ సంగారెడ్డి ప్రతినిధి.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ అధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు శ్రీమతి తూర్పు నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్ర సదాశివపేట దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై, శాస్త్రి రోడ్ హైవే సుభాష్ రోడ్ గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు సాగింది. వ్రతం వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగన్నాథ్ కి జై అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసినా భజనలు ఆధ్యాత్మిక నాట్యాలు సంకీర్తనలతో పట్టణ విధులన్నీ భక్తి పారవంశంతో మార్మోగాయి. భక్తులకు ఎక్కడికి అక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను పెంపొందిస్తూన్న ఇస్కాన్ శాఖ ప్రతినిధులను నిర్మల జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ అధ్యాత్మిక కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు సత్యనారాయణ ,పృథ్వీరాజ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు






# ఎల్‌బి నీ నో ప్రభావం పై సమీక్ష సమావేశంలో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.

తెలుగు జ్యోతి దినపత్రిక జులై 20 సంగారెడ్డి ప్రతినిధి.




సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి నియోజకవర్గంలో, విద్యుత్ తాగునీటి సమస్యల పరిష్కారం పై తక్షణ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులను నిలదీశారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో, ఎల్‌బి ని నో ప్రభావ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ కార్యచరణ ప్రణాళిక పై సమీక్ష నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గానికి మంజూరైన నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్ల పనులు ఇప్పటికీ పనులు పూర్తి కాకపోవడం పై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలంటే సబ్ స్టేషన్ల పనులు త్వరిత గతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ ఈ, 4 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే కు హామీ ఇచ్చారు.
అలాగే సదాశివపేట పట్టణంలోని 8,9, వార్డుల పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే అధికార దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ పథకం పనులు నతనడకన సాగుతుందని పేర్కొంటూ, పనులను వేగవంతం చేసి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కోరారు. వేసవి పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరినారు.

# ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!




-మొదటిపేజీ తరువాయి

స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 (తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల) భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరపున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

ఆ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు.

గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు.

కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు వీమీా సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒక ఉద్యోగి కష్టంలో ఉంటే మొత్తం సంస్థ అండగా నిలవాలనే గొప్ప సంస్కృతి టీజీఎస్ ఆర్టీసీ సొంతమని, ఈ కార్యక్రమం ఆ విలువలను మరోసారి చాటిచెప్పిందన్నారు.

ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి ఉందని, సిబ్బందికి అవసరమైన భద్రత, శిక్షణ, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతర చర్యలు తీసుకుంటున్నామని ఎండీ స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి డ్రైవర్, కండక్టర్ అత్యంత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థ ఆర్థిక బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని యాజమాన్యం విశ్వసిస్తోందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక పార్కు భూసేకరణలో

# మాయాజాలం

### రూ. కోట్లు కొట్టేసేందుకు అధికార పార్టీలోని బడా నేతలు, విపక్ష ఎమ్మెల్యే కుమ్మక్కు?

### ఓ సంస్థ భూములను వేలంలో కొన్న మరో సంస్థ.. మ్యుటేషన్ జరగకపోవడంతో రంగంలోకి అక్రమార్కులు

### 500 ఎకరాలకుపైగా భూముల పరిహారం నొక్కేసేందుకు ఇతరుల పేరిట భూములు మార్చి దోపిడీకి స్కెచ్!

### భూ బదలాయింపు జాబితాలో ఓ సిమెంట్ కంపెనీ సహా కొందరు వ్యక్తులు

### ఈ వ్యవహారంపై విచారణ జరిపితే అక్రమాలు నిగ్గుతేలే అవకాశం

**హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం విడుదల చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను అడ్డుపెట్టుకొని పరిహారం కొట్టేసేందుకు కొందరు అక్రమార్కులు స్కెచ్ వేశారు. బ్యాంకులో తనఖాలో ఉన్న ఓ ప్రైవేటు సంస్థకు చెందిన భూములను అక్రమంగా తమ పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. సదరు ప్రైవేటు సంస్థ బ్యాంకులో తనఖా పెట్టిన భూములు ఆ సంస్థ పేరిట మ్యుటేషన్ కాకపోవడాన్ని అనువుగా మలుచుకున్నారు. దీంతో ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో అడ్డదారిలో రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కిన అక్రమార్కులనే పట్టాదారులుగా పేర్కొన్నారు. దీంతో తమవి కాని భూములపై రూ. కోట్లలో పరిహారం కొట్టేసేందుకు భూసేకరణ నోటిఫి కేషన్‌ను అక్రమార్కులు అడ్డుపెట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పరిహారం కొట్టేసేందుకే పారి శ్రామిక పార్కు ఏర్పాటు ప్రతిపాద నను తెర పైకి తెచ్చారని విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ప్రయత్నాలకు అధికార పార్టీకి చెందిన బడా నేతలతోపాటు విపక్ష పార్టీకి చెందిన శాసనసభ్యుడి సహకారం ఉందని సమాచారం. కేంద్రంలో రోజూ కత్తులు దూసు కునే పార్టీల ముఖ్య నేతలు పరిహారం కొట్టేసేందుకు కలసి కట్టుగా కుట్ర పన్నినట్లు ఆరోపణలు వస్తున్నా యి.

**ముందు కొన్నదొకరు.. వేలంలో కొన్నదొకరు**

ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం హత్తీఘాట్, రాంపూర్, గూడ, గిమ్మబి గ్రామాల్లో 2062.01 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా హత్తీఘాట్ పరిధిలో 1,194.10 ఎకరాలు, గూడలో 259.23 ఎకరాల భూసేకరణకు మే 29న రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. హత్తీఘాట్‌లో 298 సర్వే నంబర్లు, గూడలో 83 సర్వే నంబర్ల పరిధిలోని భూమిని సేకరిస్తున్నట్లు యజమానుల పేర్లతో నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే జీఎస్ బయోటెక్ లిమిటెడ్ అనే సంస్థ బ్యాంకులో తనఖా పెట్టిన భూములు కూడా ఇందులో ఉన్నాయి. ఆదిలాబాద్‌కు చెందిన ఈ సంస్థ.. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని నాందేడ్‌లో స్థానికుల నుంచి 3,103.41 ఎకరాల భూమి కొనుగోలు చేసింది.

కాలక్రమంలో ఈ భూములను ఎస్‌బీఐ, యుకో, బ్యాంక్ ఆఫ్ మారిషస్ వంటి బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ. వందల కోట్లు



రుణం తీసుకుంది. అయితే జీఎస్ బయోటెక్ రుణాలు చెల్లించకపోవడంతో ఎస్‌బీఐ నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించింది. 2022 చివరి నాటికే తమకు రూ. 770 కోట్లకుపైగా రావాల్సి ఉందని ఎస్‌బీఐ పేర్కొంది. ఈ నేపథ్యంలో 2023 మార్చిలో హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియను ప్రారంభించినా అది ముందుకు సాగలేదు. దీంతో కంపెనీ ఆస్తుల విక్రయానికి (లిక్విడేషన్) 2024 సెప్టెంబర్‌లో ఆమోదం లభించింది. 2025 డిసెంబర్ 31న జరిగిన ఈ వేలంలో బెంగళూరుకు చెందిన ఓ సంస్థ రూ. 40.20 కోట్లకు ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని భూములతోపాటు మరికొన్ని భూములను దక్కించుకుంది.

ఈ మేరకు జీఎస్ బయోటెక్ లిక్విడేటర్ ఈ ఏడాది జనవరి 12న వేలంలో అత్యధిక బిడ్ వేసిన సంస్థకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) కూడా పంపించారు. బిడ్‌ను పొందిన బెంగళూరు సంస్థ.. ఆ భూములను తమ పేరిట రెవెన్యూ రికార్డుల్లో బదలాయింపు చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఈ పని కాకపోవడంతో భూసేకరణ నోటిఫికేషన్‌లో సదరు భూములకు సంబంధించిన యజమానిగా ఈ సంస్థ పేరు లేదు. గతంలో జీఎస్ బయోటెక్ పేరిట మ్యుటేషన్ జరగకపోవడంతో ఆ సంస్థ పేరు కూడా లేదు. దీంతో పరిహారం దోపిడీకి తెరలేచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమంగా ఇతరుల పేరిట మార్పి..**

గతంలో భూములు అమ్మిన యజమానులతో కుమ్మక్కైన అక్రమార్కులు.. జీఎస్ బయోటెక్‌కు చెందిన 500 ఎకరాలకుపైగా భూములను వక్ర మార్గంలో ఇతరుల పేర్లకు మార్చి దోపిడీకి తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరహాలో భూములు పొందిన జాబితాలో డెక్కన్ సిమెంట్స్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. విపక్ష ఎమ్మెల్యే కుమారుడు, కుటుంబ సభ్యులతోపాటు రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన అత్యంత కీలక నేతలు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పారిశ్రామిక పార్కు భూసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లోని సర్వే నంబర్లలోని వివరాలు కూడా అనుమానాలను బలపరిచేలా ఉన్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువకు 3--4 రెట్లు అధికంగా పరిహారం వచ్చే అవకాశం ఉండటంతో రూ. కోట్లు కొట్టేసే ప్రణాళికల్లో భాగంగానే పారిశ్రామిక పార్కు ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన ఏరియల్ సర్వేలో అధికార పార్టీ నేతలతోపాటు విపక్ష ఎమ్మెల్యే కూడా పాల్గొనడాన్ని స్థానికులు ప్రస్తావిస్తున్నారు. సుమారు 500 ఎకరాలకు సంబంధించి జీఎస్ బయోటెక్ భూములను అక్రమార్కులు తమ పేరిట మార్చుకున్నట్లు సమాచారం.

**సర్వే నంబర్ 39లో ఎన్ని అక్రమాలో..!**

హత్తీఘాట్ సర్వే నంబర్ 39లోని 33.31 ఎకరాలను జీఎస్ బయోటెక్‌కు చెందిన సుమన్ అగర్వాల్ 2006 డిసెంబర్ 11న (డాక్యుమెంట్ నంబర్ 361/06) కొనుగోలు చేశారు. మరుసటి ఏడాది ఎస్‌బీహెచ్‌కు తనఖా (డాక్యుమెంట్ నంబరు 4790/07) పెట్టారు. అయితే ఇదే భూమిని తూడెం గణేశ్ అనే వ్యక్తి ఉగ్గె సత్యనారాయణ (డాక్యుమెంట్ 7068/2016)కు విక్రయించినట్లు రికార్డుల్లో ఉంది. తిరిగి అదే వ్యక్తి డెక్కన్ సిమెంట్స్‌కు 33.31 ఎకరాలు విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ శాఖ జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో డెక్కన్ సిమెంట్స్ పేరిట 30.31 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదే తరహాలో గూడ గ్రామంలోని 112/1/3 సర్వే నంబర్ భూములు కూడా విపక్ష ఎమ్మెల్యే కుమారుడు డెక్కన్ సిమెంట్స్‌కు విక్రయించినట్లు తెలుస్తోంది. అలాగే సర్వే నంబర్లు 114, 115, 117తోపాటు పలు సర్వే నంబర్లకు సంబంధించి జరిగిన లావాదేవీలు, లిక్విడేటర్ వేలం వేసిన భూముల్లో సైతం ఇవే సర్వే నంబర్లు ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశంపై లోతైన విచారణ జరిపితే అక్రమాలు పూర్తిస్థాయిలో బయటపడే అవకాశం ఉంది.

## సదాశివపేట భక్తి పారవశ్యంగా

## శ్రీ జగన్నాథ రథయాత్ర

**ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్ర( బి ఆర్ ఎస్) యువ నాయకులు చింతా సాయి నాథ్.**

తెలుగు జ్యోతి దినపత్రిక 20 జూలై
సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.



సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర భక్తుల జయ జయ దానాల మధ్య ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ గారి తనయుడు బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్ పాల్గొని స్రీ జగన్నాథ స్వామి, బలబద్రుడు, సుభద్ర అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా చింతా సాయినాథ్ మాట్లాడుతూ శ్రీ జగన్నాథ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సనాతన ధర్మ విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సోమశేఖర్, నగేష్, ఇస్కాన్ ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## తెలంగాణ శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ ను మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నర్సింలు మర్యాదపూర్వకంగా కలిశారు.



**మోత్కుపల్లి నరసింహులు శాసనసభ స్పీకర్ ను కలిసి దళితుల సమస్యలు పరిష్కరించుటకై వినతి పత్రం సమర్పించారు.**

తెలుగు జ్యోతి న్యూస్ 20 జూలై సంగారెడ్డి ప్రతినిధి

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను మోత్కుపల్లి నర్సింలు మాజీ మంత్రివర్యులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళిత బంధు, ఎస్సీ అసైన్డ్ భూములు, లీడ్ క్యా భూములు, తదితర అంశాలకు సంబంధించిన హక్కులు, సమస్యలు మరియు వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై సమగ్రంగా చర్చించారు. దళిత హక్కుల పరిరక్షణతో పాటు పెండింగ్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్పీకర్ ను కోరినారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహా శక్తి రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ గుండె డప్పు కనకయ్య, ముంజ గళ్ళ విజయ్ కుమార్, స్పైన్ రెడ్, ప్రశాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినోను ఎదుర్కొంటాం

**హైదరాబాద్:** ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లోని ఉద్యాదిత్య భవన్ లో నల్లగొండ, సూర్యపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో ఎల్ నినో సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సోమవారం (జూలై 20) ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు సాగునీరు అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. ఈ సొరంగం పనులను వేగవంతం చేయడానికి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటామని మంత్రులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భూసేకరణకు ప్రత్యేక చట్టం


-మొదటిపేజీ తరువాయి

సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ల్యాండ్ పూలింగ్ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు మెరుగ్గా ఉన్నాయని గుర్తించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే ప్రత్యేక ల్యాండ్ పూలింగ్?కు సంబంధించి ఎటువంటి చట్టం లేదు. అందుకు అనుగుణంగా కొత్త చట్టాన్ని రూపొందించే దిశగా ప్రభుత్వం ముమ్మరంగా అడుగులు వేస్తోంది.

**అటు యజమానులకు, ఇటు ప్రభుత్వానికి లాభం**

రాష్ట్రంలో నేషనల్ హైవేలు, రైల్వే లైన్లు, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామిక కారిడార్లు, ఇండస్ట్రియల్ పార్కులు, టౌన్‌షిప్‌లు, ప్రతిపాదిత హైస్పీడ్ రైలు మార్గాలు, విమానాశ్రయాల విస్తరణ, సాగునీటి ప్రాజెక్టులు వంటి అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీగా భూములు అవసరం అవుతున్నాయి. ప్రస్తుతం ఏదైనా ప్రాజెక్టుకు భూసేకరణ ప్రారంభించగానే తమ భూములు పోతాయనే భయంలో రైతులు ఉంటున్నారు. నిరసన బాట పడుతున్నారు. ఈక్రమంలో ప్రాజెక్టులతో అందరికీ సమానంగా ప్రయోజనం చేకూరే విధానాన్ని రూపొందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ల్యాండ్ పూలింగ్ అధ్యయనం టీంలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

పూలింగ్‌లో తీసుకున్న భూముల్లో మౌలిక వసతుల ఏర్పాటు అనంతరం కొంత భాగాన్ని ప్లాట్ల రూపంలో తిరిగి భూయజమానులకు కేటాయించే విధానంపై అధికారులు




## ప్రభాస్ ఫౌజీ.. రెబల్ స్టార్ పవర్‌ఫుల్ రోల్..!

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఫౌజీ. ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఇందులో ప్రభాస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని తెలుస్తోంది. నేతాజీ సుభాశ్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసే పోరాటమే ప్రధానంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి.. ఆ తర్వాత సుభాశ్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతాడని తెలుస్తోంది. ఇది కేవలం నేతాజీ బయోపిక్ మాత్రమే కాదని.. అంతే కాకుండా ఇండియన్ ఫ్రీడమ్ కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనుందని టాక్. ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్య సాహసాలు, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. ఈ చిత్రాన్ని డిసెంబరు 3న ఫౌజీ విడుదల కానుందని తాజాగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఎప్పుడు చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించారు. దీంతో అభిమానుల్లో అంచనాలు పెంచేసింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ మూవీ డిసెంబర్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. కాగా.. ప్రభాస్ ఫౌజీతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో స్పిరిట్ చిత్రంలో కనిపించనున్నారు. ఈ మూవీలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆ తర్వాత సలార్: పార్ట్ 2, కల్కి 2898 ఏడీ: పార్ట్ 2 సినిమాలు చేస్తున్నారు.

## 10 రోజుల్లో అక్కినేని అఖిల్ 'లెనిన్' రికార్డు వసూళ్లు

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. జులై 10న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తూ అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. లెనిన్ 10 రోజుల సక్సెస్‌ఫుల్ థ్రియాట్రికల్ రన్‌లో వరల్డ్ వైడ్‌గా రూ.88 కోట్లు సాధించింది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.

ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని ఇవాళ సాయంత్రం లెనిన్ టీం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయనుంది. ఈవెంట్‌కు అక్కినేని నాగచైతన్య చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నాడు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీ రోల్స్‌లో నటించారు. ఈశ్వరీరావ్, బ్రహ్మాజీ, ప్రమోద్ పంజు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. లెనిన్ థ్రియాట్రికల్ రన్ తర్వాత జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది






## అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

### నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పుడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమనని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన ్రఘఱ్రఘ్అఱాబతీ ఔశీష్ట్ర ఇశీ ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్స్ట్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.

## అల్లు అర్జున్ 'రాకా' టీంలోకి మరో భామ.. ఇంతకీ పాత్ర ఏంటో మరి..?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.



## 'కొరియన్ కనకరాజు' కొత్త సాంగ్ రిలీజ్

మెగాహీరోల్లో వరుణ్ తేజ్ ఒకడు. ముకుంద, ఫిదా, తొలిప్రేమ, కంచె లాంటి సినిమాలతో కెరీర్ ప్రారంభంలో సమ్‌థింగ్ డిఫరెంట్ అనిపించుకున్నాడు. తర్వాత నుంచి వరసపెట్టి ఫ్లాప్స్ పడ్డాయి. 2019లో వచ్చిన 'గద్దలకొండ గణేశ్' ఓ మాదిరిగా ఆకట్టుకోగా.. తర్వాత వచ్చిన గని, గాండీవదారి అర్జున, ఆపరేషన్ వాలంటైన్, మాట్కా చిత్రాలు ఒకదానిని మించి మరొకటి డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో రెండేళ్ల గ్యాప్ తర్వాత వరుణ్ తేజ్ నుంచి వస్తున్న సినిమా 'కొరియన్ కనకరాజు'. వచ్చే నెల 7న థియేటర్లలో రిలీజ్ కానుంది. వారం క్రితం టీజర్ రిలీజ్ చేయగా పర్లేదనిపించుకుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు 'రసగుమ్మడి' అంటూ ఓ పాట వదిలారు. విలేజ్ స్టైల్లో సాగే మాస్ బీట్‌తో ఉన్న ఈ గీతం కలర్‌ఫుల్‌గా బాగుంది. తమన్ మ్యూజిక్ వినసొంపుగా ఉంది. ఇకపోతే ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. రితికా నాయక్ హీరోయిన్.



Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.